క్లుప్తంగా

హడావిడిగా పారిశుధ్య పనులు



పిచ్చి మొక్కలు తొలగించడంతో శుభ్రంగా మారిన సామూహిక మరుగుదొడ్లు

విజయనగరం రూరల్: మండలంలోని జొన్నవలసలో ఎన్నడూ లేనంతగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. గ్రామంలో సామూహిక మరుగుదొడ్ల దగ్గర నుంచి వీధుల్లో ఉన్న అన్ని కాలువల్లోనూ చెత్తను తొలగించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం పింఛన్ల పంపిణీకి జొన్నవలస రానున్న నేపథ్యంలో అధికారులు ఆగమేఘాల మీద పనులు చేట్టారు. మంత్రి వస్తే తప్ప మిగిలిన రోజుల్లో మా గ్రామం అధికారులకు కనిపించదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రాణదాతలు కండి..



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ అన్నారు. శుక్రవారం స్థానిక న్యూలైఫ్ బ్లడ్‌బ్యాంక్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మనిషి మాత్రమే రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడగలడన్నారు. ఆరోగ్యకరమైన వ్యక్తులు ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గోవింద, చైతన్యబాబు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులపై ఆరా తీస్తున కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య శుక్రవారం పరిశీలించారు. సీసీ కాలువలు, రోడ్లు, కల్వర్టులు, పైపులైన్ పనులను పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమయంలో ప్రజలతో మాట్లాడుతూ, వీధులలో చెత్తాచెదారాలు వేయరాదని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు.

జూదరులకు వినూత్న శిక్ష



కోర్టు పరిసరాలను శుభ్రం చేస్తున్న జూదరులు

డెంకాడ: మండలంలోని డి.తాళ్లవలస గ్రామ శివారులో పేకాటాడుతూ పట్టుబడిన వారికి విజయనగరం జిల్లా ఎక్సైజ్ కోర్టు జడ్జి ఎం.శ్రీనివాసరావు వినూత్న శిక్ష విధించారని ఎ.సన్యాసినాయుడు శుక్రవారం తెలిపారు. ఈనెల 26న డి.తాళ్లవలస వద్ద పేకాటాడుతున్న 13 మందిని డెంకాడ పోలీసులు పట్టుకుని, కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన ఎక్సైజ్ కోర్టు జడ్జి శ్రీనివాసరావు పట్టుబడిన 13 మంది జూదరులకు జిల్లా కోర్టు పరిసరాల్లో 5 రోజులు, డెంకాడ పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో ఒక రోజు శ్రమదానం చేయాలని తీర్పించారు. దీంతో ఎస్సై సన్యాసినాయుడు వారితో కోర్టు పరిసరాలను పరిశుభ్రం చేయించారు.

సదుపాయాలపై ఆరా..



పౌరవేదిక సభ్యులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై పౌర వేదిక బృంద సభ్యులు శుక్రవారం ఆరా తీశారు. సూపరింటెండెంట్ సంబంగి అప్పలనాయుడుతో సమావేశమై ఆస్పత్రిలో అందాల్సిన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భీశెట్టి బాబ్జి మాట్లాడుతూ.. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఔట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్ల సంఖ్య బాగా పెరిగిందన్నారు. కొన్ని విభాగాల్లో వైద్య సేవలు సక్రమంగా అందలేదనే ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. రెండు రోజుల పాటు రోగులు, అధికారులు, వైద్యులతో సమావేశమై జరుగుతున్న పరిణామాలపై నివేదిక రూపొందించి కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యేకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రొంగలి పోతన్న, రామచంద్రరాజు, రామ్మోహన్, కనకచారి, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌హేలర్‌కే దిక్కులేదు..

- ప్రభుత్వాస్పత్రుల్లో స్టాక్ నిల్
- ఆస్తమా, సీఓపీడీ రోగులకు తప్పని ఇబ్బందులు
- ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి



ఇన్‌హేలర్ పీల్చుతున్న రోగి



విజయనగరం ఫోర్ట్: గంట్యాడ మండలానికి చెందిన వి.అచ్చియ్యమ్మ కొంతకాలంగా ఆస్తమాతో బాధపడుతోంది. వారం రోజుల కింట సర్వజన ఆస్పత్రిలోని పల్మనాలజీ విభాగంలో చూపించగా.. ఇన్‌హేలర్ వాడాలని వైద్యులు సూచించారు. దీంతో ఆమె ఆ చీటీ పట్టుకుని ఫార్మసీ గది వద్దకు వెళ్లగా ఇన్‌హేలర్ లేదని ఫార్మసీ సిబ్బంది చెప్పారు. చేసేది లేక రూ. 450 పెట్టి మందుల దుకాణంలో కొనుగోలు చేయాల్సి వచ్చింది. అలాగే విజయనగరం పట్టణానికి చెందిన ఆర్.పద్మ అనే మహిళ సర్వజన ఆస్పత్రికి రెండు రోజుల కిందట దగ్గు, ఆయాసంతో బాధపడుతూ వెళ్లింది. ఆమెను పరీక్షించిన వైద్యులు తక్షణ ఉపశమనం కోసం ఇన్‌హేలర్ వాడాలని ప్రిస్క్రిప్షన్ రాశారు. ఆమెకు కూడా ఫార్మసీ విభాగం వారు ఇన్‌హేలర్ లేదని చెప్పడంతో ప్రైవేట్ దుకాణంలో కొనుగోలు చేసుకుంది. ఈ పరిస్థితి ఈ ఇద్దరే కాదు వందలాది మంది ఎదుర్కొంటున్నారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఆచరణలో మాత్రం అమలు చేయలేక పోతోంది. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు కనీసం మందులు కూడా అందించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది. ఎంతో ఆశతో సర్కార్ ఆస్పత్రికి వస్తే మందులు లేవని నిరాశతో పంపిస్తున్నారు. దీంతో రోగులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత చలికాలం సీఓపీడీ, ఆస్తమా వ్యాధుల వ్యాప్తికి అనుకూలం. ఇటువంటి తరుణంలో ఇన్‌హేలర్లు ఎంతో అవసరం ఉంది.

ఇన్‌హేలర్ తప్పనిసరి..

ఆస్తమా ఉన్నవారు చలి కాలంలోను, వర్షాకాలంలోనూ వ్యాధి నుంచి ఉపశమనం పొందేందుకు ఇన్‌హేలర్ వాడాలి. అదేవిధంగా సీఓపీడీ వ్యాధి ఉన్న వారు జీవితాంతం ఇన్‌హేలర్ వాడాల్సి ఉంటుంది.

నెలకు 1500 అవసరం..

జిల్లా వ్యాప్తంగా నెలకు 1500 నుంచి 2 వేల మంది వరకు రోగులకు ఇన్‌హేలర్ అవసరం పడుతుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇన్‌హేలర్ లేక పోవడంతో రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇందుకోసం రోగులు సుమారు 9 నుంచి 10 లక్షల రూపాయల వరకు ఖర్చు చేస్తున్నారు.

సరఫరా లేదు..

ఆస్తమా, సీఓపీడీ రోగులకు ఇన్‌హేలర్ల అవసరం ఉంటుంది. ప్రభుత్వం ఆస్పత్రులకు ఇన్‌హేలర్లు సరఫరా చేయాల్సి ఉంది. అయితే కొద్ది రోజులుగా ప్రభుత్వం నుంచి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

మహిళలకు అండగా..



ఆపదలో ఉన్న మహిళలకు వన్‌స్టాప్ సెంటర్ అండగా ఉంటుందని వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ కె. రమాదేవి, పారామెడికల్ వర్కర్ బి. నాగమణి అన్నారు. శుక్రవారం స్థానిక తోటపాలెం ఎస్ఎస్ఎస్ఎస్ కాలేజీలో వన్‌స్టాప్ సెంటర్ సేవలపై రుపొందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై బాలికలు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు జరిగితే 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.– విజయనగరం ఫోర్ట్

మాసశివరాత్రి పూజలు..



రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థాన క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతున్న ఉమా సదాశివాలయంలో మాస శివరాత్రి పూజలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకుడు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో ముందుగా గణపతి ఆరాధన, అనంతరం ఉమా సదాశివుడికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో పంచామృతాభిషేకాలు నిర్వహించారు అనంతరం స్వామి సన్నిధిలో సుమారు 3 గంటల పాటు హోమాలు జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– నెల్లిమర్ల రూరల్

ఉమామహేశ్వరాలయంలో మహా రుద్రాభిషేకం



రుద్రాభిషేకం చేస్తున్న ఆలయ అర్చకులు సందీప్‌శర్మ, తదితరులు



ఉమామహేశ్వరాలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం

విజయనగరం టౌన్: కార్తీకమాస మహాత్రయోదశి సందర్భంగా పలు శివాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక అయ్యకోనేరు దక్షిణగట్టులో గల ఉమామహేశ్వరాలయంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు అయ్యగారి శ్రీనివాసరావు, నంబూరి సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో మహారుద్రాభిషేకం జరిగింది. అర్చకులు మురపాక శ్రీనివాసశర్మ, సందీప్‌శర్మ పూజాధికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం సుమారు 3000 మంది భక్తులకు అన్నదానం చేశారు. అలాగే రింగురోడ్డు సింహాద్రినగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో 108 కలశాలను శివాకృతిలో ఏర్పాటు చేసి అర్చకులు శ్రీరామ్‌శర్మ, రామకృష్ణశర్మ పూజలు నిర్వహిచారు.

పిరమిడ్ విన్యాసం..

విజయనగరం పట్టణంలోని రింగురోడ్డులో గల శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులు చేసిన పిరమిడ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణలో క్రీడోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాలల సమన్వయకర్త వి.శ్రీనివాసరావు, పందిరి లక్ష్మీ ప్రసన్నకుమార్ (ఖోఖో ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్), పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీధర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.విక్రమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం అర్బన్



‘ఉపాధి’ కాంట్రాక్టర్లను అడ్డుకోండి

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



మాట్లాడుతున్న చాంబర్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: కాంట్రాక్ట్ పద్ధతుల్లో పనులకు జాతీయ ఉపాధి హామీ చట్టం పూర్తి వ్యతిరేకమని లోకల్ గవర్నమెంట్స్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన నిధులతో పంచాయతీ, మండల పరిషత్ ద్వారా పనులు చేపట్టాలన్నారు. అలా కాకుండా అధికార కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యేల సిఫార్సులతో ఆ పార్టీ కార్యకర్తలకు (కాంట్రాక్టర్లు) నిధులు అప్పగించి అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో చేపడుతున్న పనులను ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్టర్లకు నిధులు చెల్లిస్తే అధికారులే బాధ్యులవుతారని స్పష్టం చేశారు.

అన్న సమారాధన

విజయనగరం టౌన్: పట్టణంలోని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీకమాసం మాసశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శిరీష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కార్తీకమాసం పర్వదినాల్లో అన్నసమారాధన నిర్వహించడం ఎంతో పుణ్యఫలమన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐదువేల మంది భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమణమ్మ, మారమ్మ, ప్రకాష్ శెట్టి, శోభారాణి, భీమ, సాయి, పవన్, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 1న ..

పూసపాటిరేగ: డెంకాడ మండలం చింతవలస వేంకటేశ్వర ఆలయం ఆవరణలో డిసెంబరు 1న అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పద్మశాలి సంఘ జిల్లా గౌరవ సలహాదారు ఇమంది అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. పద్మశాలి కుటుంబ సభ్యులు హాజరుకావాలని కోరారు.

తూర్పుకాపు కులస్తుల ఆత్మీయ కలయిక రేపు

విజయనగరం పూల్‌బాగ్: తూర్పుకాపు కులస్తుల ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహించనున్నట్లు తూర్పుకాపు సంఘ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కామాక్షినగర్‌లోని తూర్పుకాపు సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రామవరం రోడ్డు పప్పుల మిల్లు శ్రీనివాస లేఔట్‌లో డిసెంబర్ ఒకటో తేదీన ఆత్మీయ కలయిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా హాజరు కావాలని కోరారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు అంబళ్ల అప్పలనాయుడు, ఆర్ల కృష్ణారావు, పత్తిగిల్లి రామారావు, పిన్నింటి సూర్యనారాయణ, ఎరం.అప్పారావు, రొంగలి రామారావు, నాగభూషణరావు, తట్టికాయల వెంకటరమణ, పతివాడ సన్నిబాబు, మొదిలి బాబు, తరుణ అంకుశం తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు శిక్షణ..



భోగాపురం మండలంలోని చెరుకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో 2024 డిసెంబర్ 5 నుంచి 7 వరకు బీఎస్ఎన్ఎల్ సంస్థ సహకారంతో నిర్వహించనున్న ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ – జనరేషన్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్స్ శిక్షణ కార్యక్రమాలను మండలంలో ఉన్న అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శిక్షణ కార్యక్రమాలకు సంబంధించిన బ్రోచర్లను శుక్రవారం ఆయన అవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా అధ్యాపకుల నైపుణ్యత మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. మురళీకృష్ణ, డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి వి. శివ భాస్కరరావు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

– నెల్లిమర్ల రూరల్

ఆదాయ, వ్యయాలతో అంచనా బడ్జెట్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు

డెంకాడ: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో గతేడాది ఆదాయ, వ్యయాలను ఆధారంగా చేసుకుని అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ వాసుదేవరావు, ఎంపీడీఓ భవానీ మాట్లాడుతూ.. 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.63,57,72,337 రూపాయలతో బడ్జెట్ రూపొందించగా... 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 71,03,82,337 రూపాయలతో అంచనా బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పరిశీలన తర్వాతే అనుమతులు



భవన నిర్మాణ అనుమతి జారీ చేసేందుకు క్షేత్ర స్థాయి పరిశీలన చేపడుతున్న అధికారులు

విజయనగరం: క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టిన తర్వాతే భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని కార్పొరేషన కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. భవన నిర్మాణ అనుమతులకై వచ్చిన దరఖాస్తులను పరిశీలించే నిమిత్తం ప్రణాళిక అధికారులు ఆయా భవన నిర్మాణ ప్రాంతాలకు శుక్రవారం వెళ్లి వివరాలు సేకరించారు. పూల్‌బాగ్ ప్రాంతంలో అసిస్టెంట్ సిటీప్లానర్ హరిబాబు ప్రణాళికా సిబ్బందితో వెళ్లి భవన నిర్మాణానికి సంబంధించి హద్దులు, తదితర వివరాలు పరిశీలించారు. హనుమాన్‌నగర్‌లో అనుమతి లేకుండా పైఅంతస్తు నిర్మిస్తుండడాన్ని గమనించి, పనులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. అనుమతుల్లేని నిర్మాణాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

మద్యం సీసాలు స్వాధీనం

పూసపాటిరేగ : మండలంలోని పేరాపురం జంక్షన్‌లో 20 మద్యం సీసాలతో ఓ వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తుండగా.. ఒనుము అసిరమ్మను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు

- మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్‌లో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కార్పొరేషన్ సమావేశ మందిరంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించి, 47 అంశాలను ఆమోదించారు. ఈ సందర్భంగా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రజలకు మంచి పాలన అందించడమే అందరి ధ్యేయమని పునరుద్ఘాటించారు. సమావేశం అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. అందరి సహకారంతో నగర అభివృద్ధి సాధ్యమన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని నగరంలో ఉన్న 50 డివిజన్లకు 20 లక్షల రూపాయలు చొప్పున అభివృద్ధి పనుల నిమిత్తం కేటాయించడం జరుగుతుందన్నారు. ప్రాధాన్యతాక్రమంలో పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణక్య, సుంకరి నారాయణస్వామి, రేగాన రూపాదేవి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మా బజార్ పరిశీలన

నెల్లిమర్ల: నగర పంచాయతీలోని రామతీర్థం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను శుక్రవారం పలువురు అధికారులు పరిశీలించారు. మెప్మా పీడీ జీవీ చిట్టిరాజు, నగర పంచాయతీ కమిషనర్ కె. అప్పలరాజు సందర్శించారు. ఉత్పత్తుల కొనుగోలుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీఎంఎం డి. గోవిందరావు, సీఓలు, ఆర్‌పీలకు సూచించారు.